# మూకలు

శ్రీ "పట్టాభి"

అల్లరిమూక స్వభావము యెచ్చటికి పోయి చూచినా వొకే విధముగా వుంటుంది. ఇండియాలోనే కాదు—ప్రపంచములో యెక్కడికిపోయినా వొకే రూపం దానికి. అల్లరి మూకలో కొంతభాగము వార్తా పత్రికలు వహించుతవి. వాటి తత్వము యెక్కడ చూచినా వొకటే.

అమెరికాలో ఒక తెల్లపిల్ల మూర్ఛ తగలడమువలన ప్రక్కన పోతున్న నీగ్రో బాలునిపై పడ్డది. అలాగు పడడముచేత భయపడి అరచింది. అరపునకు కారణము ఏమని అడుగగా రంగుభేదముతో ఆనీగ్రో తననుఅవమానించినాడని పోలీసులకు తెలిపినది. పోలీసులు ఆ నీగ్రో బాలుడు జిమ్మును' బంధించినారు అది తెల్లవారి రాజ్యం. ఈ వార్తను వార్తా పత్రికలు కొంచెము జనులకు వుద్భోధ కలిగేటట్టు ప్రకటించినవి. అంతటితో మొదలు అల్లరి.

మధ్యాహ్నము నాలుగు గంటలైంది. ఒక్లహోమాలో యెచ్చటచూచినా అల్లరి. పెద్ద అల్లరి అవుతుందని నీగ్రోలలో కొందరు అల్లరిని ఆపుటకు ప్రయత్నించను మొదలు పెట్టినారు. వారిని బుజ్జగించేటట్టు "అల్లరి చేయవద్దు. అల్లరిచేస్తే మన నీగ్రోల నందరిని ప్రాణముతోనే కాల్చెదరు. జిమ్మును వారు యేమి చేయుటకును అనుకోలేదు. కనుక ప్రభుత్వమువారి యధీనములో ఉన్నంతకాలము యెవ్వరునుయేమియుచేయలేరు జిమ్మును. అందువలన మీరేమియు భయపడవద్దు" అని చెప్పినారు. అయితే వినేవారెవ్వరూ లేరు.

ఒక్లహోమా, అమెరికాలోని వొక పట్టణము. ఈ వూరుకు మధ్య రైలు బాట వుండటమువల్ల ఊరు రెండు భాగములుగ యేర్పడ్డది. ఒక భాగములో తెల్లవారు మరియొక భాగములో నీగ్రోలు నివసిస్తూ వుంటారు. ఈ రెంటిటికి మధ్య జైలుకూడ వున్నది. ఆ జైలులోనే తెల్లపిల్లను అవమాన పరచినాడని నేర మారోపింపబడిన జిమ్ము వుంచబడ్డది.

ఏడుగంటలైంది. మూడుకార్లు జైలు ఆవరణ చుట్టూ తిరుగుతున్నవి. వాటిలో నీగ్రోలు కూర్చొని యున్నారు. అమెరికాలోనివారికి కొన్ని రాక్షస కృత్యములు వినోదములుగ వుంటవి. నీగ్రోలను పట్టుకొని ప్రాణముతో నున్నప్పుడే మంటలో కాల్చడము మొదలైనవి వారికి వినోదములుగ నుంటవి. కనుక జిమ్మును అదేవిధముగ కాల్చుతారని వారికి భయం. అంటే జైలులో నున్న నీగ్రోలనుకూడ దొమ్మిచేసి యెత్తుకొని పోయి కాల్చి ఆనందించడము వారికి వాడుక. దొమ్మి జరుగుతుందని ఆ వూరి మేజిస్ట్రేటుకు తెలుసు, అయిన యేమిటో గాని వూరుకొన్నాడు.

తెల్లవారు కూడా జైలుసమీపములో గుంపులు కూడ గుంపులుగా మొదలుపెట్టినారు. కాలము గడిచేకొద్దీ తెల్లగుంపులో ఆవేశము అధికమవుతున్నది. కొంతసేపటికి అంతా నిశ్శబ్దము—శబ్దములేని నడకలు—గుసగుసలు. తనలో నున్న యీర్ష్య నాపుకోలేక పోయినాడొక తెల్లమనిషి. అతని చేతిలో నున్న తుపాకి ప్రేలినది. ఆ గుసగుసలు అమాంతముగ ఆగిపోయినవి. మళ్లీ అంతా నిశ్శబ్దము. నీగ్రోల కారులోనుండి తుపాకి ప్రేల్పు నిశ్శబ్దమును భేదించినది. దొమ్మికి నీగ్రోల కారులోనుండి వచ్చిన ప్రేల్పుడు కారణమైంది.

ఉన్న తెల్లమూకంతా ఆ మూడు నీగ్రోకార్లను చుట్టుకొన్నవి. వాటిలోనున్న కొద్దిమంది నీగ్రోలును భయపడి పరుగెత్తను మొదలు పెట్టినారు. తెల్లమూకంతా వారిని వెంటాడింది. తుపాకి ప్రేల్పులైంది. భరింపలేని బాధతో—అరపుతో క్రిందపడ్డాడు వొక నీగ్రో.

అతనిని చుట్టుముట్టింది. తెల్లమూక. బాధతో అరుస్తున్న నీగ్రోను చూచుట వారికి ఆనందము. అంతా

చూచి ఆనందించారు. ఆంబ్యులెన్సు కారులు వచ్చినవి. దెబ్బ తగిలినవారిని తీసుకొని పోవుటకు తెల్లమూక వారు వాటిపై తుపాకులు గురిపెట్టి నీగ్రోలకు సహాయము చేస్తే కాలుస్తానన్నారు. ఇక చేసేది లేక తిరిగి పోయినవి ఆంబ్యులెన్సులు. పాపము ఆ నీగ్రోకు కడుపులో దెబ్బ తగిలింది.

బాధతో అరుస్తున్నాడు ఆనీగ్రో. తోడివారు అతనికి సహాయము చేయ్యాలనుకొని వెనుదిరిగారు. వారిని తుపాకులతో యెదుర్కొన్నది తెల్లమూక. చేయునది లేక నీగ్రోలు పరుగెత్త వలసి వచ్చింది. దెబ్బ తగిలిన నీగ్రోను కాళ్లతో త్రొక్కుతున్నారు. అతను బాధకు కేకలేస్తున్నాడు. ఆ కేకలు తెల్ల మూకకు ఆనందము నిస్తున్నవి. అప్పటికి పదునాల్గు గంటలు కాలమైంది వేట మొదలు పెట్టి. మూడుకారులలో వచ్చిన నీగ్రోలను ముగించారు.

ఇంకా ఆ వినోదము చాలాలేదు. ప్రతి అంగడీ దోపిడి. ఎచ్చట నున్న తుపాకులు తూటాలు దోపిడి చేయబడినవి. వాటితో కూడ గుడ్డలు మొదలగునవి దొంగలింపబడ్డవి.

* * *

పాపము ఆ అమాయకు రాండ్ర మీదకు తెల్లమూకవచ్చి పడేవరకు యెవరికీ యేమీ తెలియదు. కొంతమంది వొక గృహములో దాగియున్నారని ఆ మూకకు తెలిసింది. అప్పటినుండి మొదలు గృహములను తగుల బెట్టడము.

ఒక్కొక్కమూకకు ఒక్కొక్క రకపు వినోదము కావాలి. కనుక తమ యిష్టమైన రీతి వినోదించారు. అయితే వొక విధమును మాత్రము అందరూ అవలంబించినారు. తుపాకులను తాళపురంధ్రాల సందులో పెట్టి కాల్చడము. అవి బ్రద్దలై తలుపు తెరువ బడినపుడు లోనికిపోవడము, లోనున్న దంతా ధ్వంసము చేయడము, అంతా ముగిసిన వెనుక ఆ గృహాన్ని తగుల బెట్టడము.

రాత్రి రెండుగంట లగుసరికి నీగ్రో గృహములలో మూడు వంతులు మంటల పాలుచేశారు. వాటిని ఆర్పుటకు ఆర్పు యంత్రములు వచ్చినా నీగ్రోలను యెదుర్కొన్నట్లు వాటినీ యెదుర్కొన్నారు. మూడు గంట లగుసరికి వినోదపు వేటకు నీగ్రోలు తక్కువ అయినారు. అప్పుడప్పుడు యెవరో వొక నీగ్రో తెల్లవారి వేటకు గురి అగుచుండేవాడు.

ఒక నీగ్రో డాక్టరు ముందు జరుగనున్న దేమీ ఆలోచించుకొనక తన యింటి మెట్లపైన చూస్తూ నిలుచున్నాడు. ప్రక్కన తనభార్య నిలుచున్నది. "నన్ను కాల్చవద్దు. నన్ను కాల్చవద్దు. నేను డాక్టరుని" అని డాక్టరు వున్నట్లుండి భయముచే అరచినాడు.

తుపాకి ప్రేల్పుడు శబ్దమైంది.

దేహమంతయూ తుపాకి ప్రేల్పులతో క్రిందకూలినాడు డాక్టరు. ప్రక్కనున్న భార్య యీ ఘోరదృశ్యమును చూచి పిచ్చి పట్టి పరుగెత్తినది. కొంతసేపటివరకు ఆ వున్మాదినిని చూచి ఆనందించారు. ఇక చాలనుకొన్నారు. ఒక్క ప్రేల్పుతో కూడ నేలకూలినది ఆవున్మాదిని.

కొంత దూరము సాగిపోయింది ఆమూక. అచ్చట వొక మోటారుషెడ్డు అగుపడ్డది. "ఎవరైనా నీగ్రోలు వున్నారా" అని అరచుచూ లోనికి పోయినారు. "నేనున్నాను" అని అన్నాడు వొక అమాయకుడైన నీగ్రో బాలుడు కారును తుడుస్తూ. అంతటితో ఆబాలుని తల నుండి దూరినది ఒక తుపాకి గుండు.

తెల్లవారినది. ఒక్లహోమాలోని నీగ్రోభాగము పూర్తిగ నాశనమైనది.

విచారించి జిమ్మి నిర్దోషియని అతనిని వదలిపెట్టినారు. ఇంతవరకూ వూరుకున్న మిలిటరీవారు అచ్చటచ్చటయున్న నీగ్రోలను తమ యధీనములో నుంచుకొన్నారు. వారికే ఆ పగరానీయకుండ కాపాడే టందుకన్నారు. నీగ్రోల తెల్ల యజమానులుపోయి మిలిటరీ యధీనములోనున్న తమ సేవకులను గురుతుపట్టి చెప్పగా వారు నిర్దోషులని అందరికి తెలియునట్లు ఇనుపబ్యాడ్జిలను వారికి తగిలించి వదలినారు నీగ్రోలను. ఈవిధముగ అందరిని వదలినారు. ఇక యీ నిస్సహాయు లందరూ ఒక్లహోమాలో వేరే నీగ్రో భాగము సృష్టించవలసినదే.

(అనువాదము)